నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | డిసెంబర్ 08, 2024 | www.navatelangana.com

జిల్లా స్థాయి అవార్డు అందుకున్న అనుష్క, కావేరి

నవతెలంగాణ-ఇచ్చోడ

జిల్లా స్థాయి వైజ్ఞానిక ఇన్‌స్పైర్ ప్రదర్శనలో భాగంగా రవాణా, కమ్యూనికేషన్ విభాగంలో ప్రతిభ కనబరిచిన మండల కేంద్రంలోని విద్యాలయ స్కూల్‌కు చెందిన అనుష్క, కావేరి డీఈఓ ప్రణీత చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వీరిని విద్యాలయ కరస్పాండెంట్ శ్యాంరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమోద్, ఉపాధ్యాయులు సుభాష్ అభినందించారు.



పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

బోథ్ : మండ కేంద్ర గ్రామపంచాయతీలో మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు ఎంపిడివో రమేష్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ ఇలా అమ్మ అన్న పేరు మీద సేవలు చేయడం చాలా అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు చాలా సేవ కార్యక్రమాలు చేశారని, ఇటీవలే కంటి వైద్య శిబిరం, కళ్లద్దాల పంపిణీకి వెళ్లానని తెలిపారు. ఇలాగే మరిన్ని సేవ కార్యక్రమాలు చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్మికులకు చలి కాలంలో దుప్పట్లు ఇవ్వడం చాలా గొప్ప మనసు అని కొనియాడారు. భవిష్యత్తులో సొసైటీకి తోడ్పాటు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు ఆసిఫ్, గంగన్న, గంగయ్య, అన్వేష్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డును సందర్శించిన సీపీఐ(ఎం) బృందం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని మార్కెట్ యార్డును సీపీఐ(ఎం ఏరియా కమిటీ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా పత్తి కొనుగోళ్లను, తేమ శాతాన్ని పరిశీలించారు. అలాగే రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ సెక్రటరీ శ్రీకాంత్‌తో మార్కెట్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు మాట్లాడుతూ రైతులు అనేక రకాల మోసాలకు గురవుతున్నారన్నారు. రైతులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి ఎక్కువ, గిట్టుబాటు అయ్యేది తక్కువ అని తెలిపారు. మార్కెట్‌కు కోట్ల ఆదాయం వచ్చినా రైతులకు కనీస సౌకర్యాలు లేవని వాపోయారు. సీసీఐ కొనుగోళ్లలో అనేక నిబంధనలు రైతులకు నష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. మార్కెట్ సందర్శనలో పార్టీ బృందం నాయకులు డి.స్వామి, కె.స్వామి, ఎం.గంగారాం, బి.గంగారాం, జి.స్వామి పాల్గొన్నారు.

యువత క్రీడల వైపు మొగ్గు చూపాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

యువత క్రీడల వైపు మొగ్గు చూపాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం మండలంలోని చాందా(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్-2024 క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల వైపు మొగ్గు చూపాలని ఉద్దేశంతో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉంటామన్నారు. సిఎం కప్‌లో ప్రతిభ కనబరిచి మండల, జిల్లా స్థాయిలో రాణించాలని ఆకాక్షించారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత నిస్తోందన్నారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, తహసీల్దార్, ఎంపీడీఓ చైర్మన్‌లుగా వ్యవహరిస్తారని తెలిపారు. విద్యా శాఖ, అసోసియేషన్ క్రీడల విభాగం షెడ్యూల్ ప్రకారం క్రీడల నిర్వహణలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, యోగా, వాలీబాల్, ఫుట్ బాల్, జిల్లా స్థాయిలో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, చెస్, బాక్సింగ్, స్విమ్మింగ్‌తో పాటు మరికొన్ని రకాల క్రీడలు ఉంటాయని పేర్కొన్నారు. మండల స్థాయిలో డిసెంబర్ 10 నుండి 12 వరకు, జిల్లా స్థాయిలో డిసెంబర్ 16 నుండి 21 వరకు అలాగే రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 27 నుండి జనవరి 2 వరకు క్రీడలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ సోమయ్య, మాజీ సర్పంచ్ దారెట్ల భాస్కర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థి ఉత్తమ ప్రతిభ



నవతెలంగాణ-కడెం

జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో శుక్ర, శని వారాల్లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్ మేళాలో కడెం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. వ్యవసాయానికి సంబంధించిన ప్రదర్శనలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి రామ్‌సాగర్ ప్రథమ బహుమతి, డ్రై హ్యాండ్ వాష్ ప్రదర్శనకు 9వ తరగతి విద్యార్థి సూర్యతేజ బహుమతి సాధించారు. విద్యార్థులకు బహుమతులు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎంను కలిసిన జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్ కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులందరూ రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి నేతృత్వంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ నాయకులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. కష్టపడి పని చేయండని, పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

జీతం రాక..వెతలు తీరక..!

- తొమ్మిది నెలలుగా దరిచేరని వేతనాలు
- అవస్థలు పడుతున్న ఆశ్రమ పాఠశాలల ఏఎన్‌ఎంలు
- కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్న వైనం
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ఒక నెల జీతం రాకపోతేనే.. తల్లడిల్లిపోయే ఈ రోజుల్లో ఏకంగా తొమ్మిది నెలల నుంచి జీతాలు దరిచేరకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం పట్టించుకోక.. అధికారులు దృష్టిసారించక అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ఏఎన్‌ఎంలు. జీతాలు రాక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నా.. ఉన్నతాధికారులు వీరి పరిస్థితి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం 24గంటల పాటు విధులు నిర్వర్తిస్తున్న ఈ ఆరోగ్య సంరక్షకులను పట్టించుకున్న నాథుడే లేకుండాపోయారు. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడం.. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ వేతనాలు ఇవ్వకపోవడం మూలంగా కుటుంబ పోషణ కోసం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకురావాల్సిన దుస్థితి ఉందని ఏఎన్‌ఎంలు వాపోతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఆదివాసీ గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు(ఏఎన్‌ఎం)ల దుస్థితి దయనీయంగా మారింది. 24గంటల పాటు విధులు నిర్వర్తిస్తూ విద్యార్థుల బాగోగులు చేసుకుంటున్న వీరి సంక్షేమాన్ని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఐటీడీఏ పరిధిలోని 153 ఆశ్రమ పాఠశాలల్లో ఒక్కొక్కరికి చొప్పున 153మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో కొందరు 20ఏండ్లుగా..మరికొందరు 15ఏండ్లుగా ఒప్పంద ప్రతిపాధికన(అవుట్ సోర్సింగ్) పద్ధతిన పనిచేస్తున్నారు. ఇందులో చాలా మంది తొలుత రూ.2500 నుంచి పనిచేస్తున్నారు. ప్రస్తుతం వీరి వేతనం నెలకు రూ.22,700 వరకు వస్తోంది. కానీ గత తొమ్మిది నెలల నుంచి జీతం రాకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా తొమ్మిది నెలల నుంచి వేతనాలు దరిచేరకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. వేతనాల విషయం ఉన్నతాధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి రావడం లేదని తామేం చేయలేమని చెబుతుండగా.. ఏజెన్సీ వారు సైతం బడ్జెట్ రావడం లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

24గంటల పాటు విధులు..!

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వసతితో కూడిన విద్యనందిస్తుండటంతో వీరి ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఏఎన్‌ఎంలను నియమించింది. వీరు రోజువారీగా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ ఉండాలి. అనారోగ్యానికి గురైతే మందులు అందిస్తుంటారు. పిల్లలు తీవ్రమైన జ్వరం తదితర వాటితో బాధపడితే వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయిస్తుంటారు. విద్యార్థులు ఆస్పత్రిలో చేరితే వారు డిశ్చార్జి అయ్యే వరకు అక్కడే ఉండి తిరిగి పాఠశాలకు తీసుకురావాలి.

24గంటల పాటు విధులు నిర్వర్తిస్తుంటారు. ఒక్క రోజు కూడా సెలవు ఉండదని.. మరోపక్క పాఠశాలల్లో ఏమైనా ఘటనలు జరిగిన సందర్భాల్లో మమ్మల్నే బాధ్యులను చేస్తూ సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకుంటున్నారని వాపోతున్నారు. సక్రమంగా వేతనాలు రాక.. సెలవులు లేక కుటుంబాలకు దూరంగా ఉంటూ దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. జీతాలు రాకపోవడంతో ఇతరుల వద్ద అప్పులు చేస్తూ కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని అంటున్నారు. ఉద్యోగ భద్రత కూడా లేదని వెట్టిచాకిరి చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.



ఉద్యోగుల ఆందోళన(ఫైల్)

కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది : కామేశ్వరి, గిరిజన సంక్షేమశాఖ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు



ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న తమకు గత తొమ్మిది నెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో కుటుంబ పోషణ చాలా కష్టంగా మారుతోంది. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే దృష్టిసారించి వేతనాలు చెల్లించాలి. మరోపక్క తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఏఎన్‌ఎంలతో సమానంగా ఇన్సూరెన్సు, వివిధ రకాల సౌకర్యాలు కల్పించాలి.

పెండింగ్ వేతనాలు సత్వరం చెల్లించాలి : అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు గత తొమ్మిది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు సత్వరమే చెల్లించాలి. మరోపక్క వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్న గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలి. నిబంధనల ప్రకారం బడ్జెట్ రాకపోయినా మూడు నెలల వేతనాలు గుత్తేదారు చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.మరోపక్క ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం నుంచే నేరుగా వేతనాలు చెల్లించాలి.

పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా పాలన విజయోత్సవాలు

- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, కమాండెంట్
- దొంగతనాల నివారణ ప్రత్యేక సీడీ ఆవిష్కరణ
- సైబర్ నేరాలపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమై సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో శనివారం విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, రెండవ బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్ ముఖ్యాతిథులుగా హాజరయ్యారు. ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం పోలీస్ డిపార్ట్మెంట్ లో వినియోగించే 100 డైల్ బ్లూ కోర్ట్ వాహనాలతో, నూతనంగా పోలీసు వ్యవస్థకు వచ్చిన వాహనాలను అత్యవసర సమయాలలో వినియోగించే వజ్ర, ముఖ్య అతిథి ప్రయాణించే బుల్లెట్ రెసిస్టెన్స్ వాహనాలను ప్రదర్శించారు. అనంతరం పాఠశాలల విద్యార్థుల సమక్షంలో పోలీసుల ఆధ్వర్యంలో వివిధ సందర్భాలలో వినియోగించే సంగీత పరికరాలతో కూడిన బృందంతో కళా ప్రదర్శనను నిర్వహించారు. అలాగే డాగ్ స్క్వాడ్ బృందంతో వివిధ సందర్భాలలో పోలీసు జాగిలాలు చేసే విధులు, మాదకద్రవ్యాలను గుర్తించడం, మందు పదార్థాలను గుర్తించడం లాంటి ప్రదర్శనలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో జిల్లా పోలీసులు వినియోగించే అత్యాధునిక ఆయుధాల ప్రదర్శన, ఆపత్కాల సమయంలో అత్యవసరంగా స్పందించే డిడిఆర్ఎఫ్ బృందాల పనిముట్ల ప్రదర్శన, పోలీసు కళాబృందం మ్యూజిక్ పార్టీ కళా ప్రదర్శన స్టాల్, బాంబు డిస్పోజల్ టీం, మాదకద్రవ్యాల అవగాహనతో కూడిన స్టాల్, జిల్లా వ్యాప్తంగా పట్టుకున్న గంజాయి, గంజాయి నిర్మూలన అవగాహనపై స్టాల్, షీ టీం విధులను తెలియజేస్తూ ఉన్న స్టాల్, సైబర్ క్రైమ్‌పై అవగాహనతో కూడిన స్టాల్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, ఫింగర్ ప్రింట్స్ పనిచేయు తీరు, ట్రాఫిక్ నియమాలపై ఉన్న తీరుపై స్టాల్స్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి చేశామని, ప్రభుత్వం పోలీసు శాఖ పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ సీఎం రేవంత్ ఒడ్డి హోంగార్డులకు రోజుకు ఒక వెయ్యి రూపాయల జీతాన్ని ప్రకటించడం హర్షనీయమని తెలియజేశారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ప్రశాంత వాతావరణంలో ప్రజలకు భద్రత, రక్షణ చర్యలను చేపడుతున్నట్లు తెలియజేశారు. మారుమూల ఆదివాసి గిరిజనులకు వైద్య సదుపాయాలు అందించాలని మెగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తూ వైద్య సేవలను మరింత దగ్గర చేయడం జరిగిందని తెలిపారు. ఆదివాసి యువత అభివృద్ధి చెంది క్రీడలలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. క్రీడా సామాగ్రిని అందజేసి జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహించడం జరిగిందని తెలిపారు. సైబర్ క్రైమ్ బారిన పడిన బాధితులకు రూ.17 లక్షల వరకు తిరిగి వారి అకౌంట్లకు చేరే విధంగా న్యాయశాఖ సహకారంతో న్యాయం చేకూర్చడం జరిగిందని తెలిపారు. సంఘవిద్రోహశక్తుల కార్యకలాపాలను నిర్వీర్యం చేస్తూ గత నెలలో నాలుగు పిస్తోళ్లను, 8 మాగ్జిన్‌లను, 18 లైవ్ రౌండ్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం దొంగతనాల నివారణకు పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన ఒక వీడియో సీడీని, సైబర్ క్రైమ్ బారిన పడకుండా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డిసిసిబి చైర్మన్ భోజారెడ్డి, అదనపు ఎస్పీ బి సురేందర్‌రావ్, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, బి.సురేందర్‌రెడ్డి, హసిబుల్లా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, ఎస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేపట్నుండి ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రారంభించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. వచ్చే సోమవారం నుండి ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభించాలని, గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా నిర్వహించాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొబైల్ యాప్‌ను వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సిన తీరును ఒక్కో అంశం వారీగా ఈడిఎం అధికారులకు అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఏయే అంశాలను పరిశీలించాలని, మొబైల్ యాప్‌లో వివరాలను ఏవిధంగా పొందుపర్చాలి అనే అంశాలను పీపీటీ ద్వారా ప్రయోగాత్మకంగా వివరించారు. సర్వే సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరిస్తూ, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరపాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియ, సీఈఓ జితేందర్, ఈడీఎం రవీందర్ పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా విజయోత్సవ సంబరాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, నాయకులు తోట సత్యం, జన్నారపు శంకర్, పరిమి సురేష్, సౌకత్ పాషా, బి. రాజేందర్, నయీమ్, మున్సిపాలిటీ, మెప్మా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మరు

- రాష్ట్ర మైన్స్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్



నవతెలంగాణ-ఖానాపూర్

బీఆర్ఎస్ పార్టీ పదేళ్ళ ప్రజలకు చేసిందేమీ లేదని, ఆ పార్టీని ప్రజలు ఇకపై ఎప్పటికీ నమ్మరని రాష్ట్ర మైన్స్ అండ్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డిసిసి అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శనివారం పట్టణంలోని జెకె ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన విజయోత్సవ వేడుకలలో వారు పాల్గొని మాట్లాడారు. సంక్రాంతిలోగా రైతు కుటుంబంలో ఆనందం చూస్తామన్నారు. సంవత్సర కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చామని తెలిపారు. హామీలను ఒక్కొక్కటిగా పూర్తి చేశామని, ఇకముందు కూడా ప్రభుత్వ ఫలాలు అందరికీ అందుతాయని పేర్కొన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, ఖానాపూర్, సత్తెనపల్లి పిఏసిఎస్ చైర్మన్లు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ఆమంద శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్ పాల్గొన్నారు.

చెరువులో ప్రయివేటు ఆస్పత్రి వ్యర్థాలు

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



నిర్మల్ కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో ఇష్టానుసారంగా ప్రయివేట్ ఆస్పత్రి నిర్వహకులు హస్పిటల్ వ్యర్థాలను పడేస్తున్నారు. గడువు ముగిసిన సిరంజీలు, మందులను చెరువు దగ్గర పడేస్తున్నారు. వీటివల్ల చెరువులోని నీరు కలుషితమై పశువులు, చేపలు, ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. అదే విధంగా దుర్గాందం వెదజల్లుతుందని ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

2

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

ఆదివారం | డిసెంబర్ 08, 2024 | www.navatelangana.com

ఆయాల ప్రమోషన్లలో పారదర్శకత పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆయాల ప్రమోషన్లలో పారదర్శకత పాటించాలని, అర్హులైన వారందరిని నుండీ దరఖాస్తులు స్వీకరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని చోట్ల అర్హులకు అన్యాయం జరిగినట్టు తెలిసిందని, అధికారులు డబ్బులు తీసుకోని ప్రమోషన్లు ఇస్తున్నట్టు అభ్యర్థులకు అనుమానంగా ఉన్నదని పేర్కొన్నారు. వీటన్నింటిని నివృత్తి చేస్తూ అర్హులైన వారందరి నుండీ దరఖాస్తులు స్వీకరించాలని, మెరిట్ లిస్ట్ బహిర్గతం చేయాలని కోరారు. అభ్యంతరాలకు కనీసం మూడు రోజులు గడువు ఇవ్వాలని, కలెక్టర్ సమక్షంలో సెలెక్షన్లు జరగాలన్నారు. అప్పుడే పారదర్శకంగా జరిగినట్టు అభ్యర్థులు భావిస్తారని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ అధికారులపై అనుమానాలు వస్తున్నా నేపథ్యంలో కలెక్టర్ చొరవ తీసుకోని అర్హులైన అభ్యర్థులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వెల్మ కులస్తులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ రంగినేని మనిషా పవన్ రావ్ డిమాండ్ చేశారు. శనివానం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్సైకు ఫిర్యాదును అందించారు. కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రభుత్వం కూడా ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేవారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ రంగినేని మనిషా పవన్ రావ్ మాట్లాడుతూ షాద్ నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెల్మ కులస్తులను చులకన చేసేలా మాట్లాడడం బాధాకరమన్నారు. కాంగ్రెస్‌లో వెల్మ కులస్తులు లేరా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా కేసీఆర్ అన్ని వర్గాలను కలుపుకొని ఉద్యమించడంతోనే స్వరాష్ట్రం సాధ్యమైందన్నారు. బాధ్యతయుత పదవీలో ఉండి అన్ని వర్గాలను సమానంగా చూస్తామని ప్రమాణం చేసిన ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెల్మ సంఘం అధ్యక్షుడు జగన్నాథ్, రోకండ్ల రమేష్, ప్రభాకర్ రావ్, భారత్, ముకుంద్‌రావు, రాజు పాల్గొన్నారు.

ఎకరూప దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-తాంసి

అంగన్‌వాడీ పిల్లలకు శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మండల విద్యాధికారి శ్రీకాంత్ పిల్లలకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హైస్కూల్ ప్రైమరీ పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన పిల్లలకు మాత్రమే ఏకరూప దుస్తులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఒక్కొక్కరికి రెండు జతలు చొప్పున అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు భాగీర్థ విజయలక్ష్మి, సరిత ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి తేడా లేదు

- ఛార్జ్ షీట్ విడుదల చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఏడాది పాలన గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎలాంటి తేడా లేదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం ఎస్టీయూ భవనం వద్ద కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై చార్జ్ షీట్‌ను విడుదల చేశారు. అనంతరం అక్కడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కాంగ్రెస్ వైఫల్యాలపై నినాదాలు చేస్తూ సాగింది. అధికారంలోకి రాకముందుకు కాంగ్రెస్ అనేక హామీలను ఇచ్చిందని, ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా అధికారంలోకి వచ్చాక అమలు చేయలేదని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. రైతులకు రుణామాఫీ, రైతు బంధు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, పింఛన్ తదితర వాటిని గాలికి వదిలేసిందన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల హయంలో రూ7 లక్షల కోట్ల అప్పులుంటే కాంగ్రెస్ ఏడాది పాలతో రూ.లక్ష 20 వేల కోట్ల అప్పులు చేసిందన్నారు. పాలనలో కాకుండా కాంగ్రెస్ అప్పుల్లో పోటీ పడుతుందన్నారు. బీసీలకు బడ్జెట్ కేటాయిస్తామని ఎన్నికల ముందు సీఎం అనేక హామీలు ఇచ్చి మొండి చేయ్యి చూపించారని మండిపడ్డారు. ఏం సాధించారని విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు ఆధినాథ్, ఎన్రాల నగేష్, ముకుంద్, దినేస్ మటోలియ, రఘుపతి, ధోని జ్యోతి, ఆకులప్రవీణ్ ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లను పర్మినెంట్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా కార్యదర్శి అరికిల్ల బాపురావ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్ ట్రెడ్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. రవీంద్ర భారతిలో మంత్రులు ఫీల్డ్ అసిస్టెంట్‌తో సమావేశం నిర్వహించారు. ఆర్థిక శాఖ వద్ద ఫైల్ పెట్టినట్టు వచ్చిన వెంటనే రెగ్యులర్ చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి ఫీల్డ్ అసిస్టెంట్లు రాథోడ్ మోతిరాం, మేట్టే సదాశివ్, శేష్‌రావ్, ప్రఫుల్ హాజరయ్యారు.

చికిత్సకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-తాంసి

మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన నిరుపేద పవర్ ప్రవీణ్ 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లువిరిగిపోయాయి. చికిత్స కోసం శనివారం బాధితునికి సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ ఇంటికెళ్లి పరమార్శించి తన వంతుగా ఆర్థిక సాయంగా అందజేసి ఉదారత చాటుకున్నారు. బాధితులతో పాటు కుటుంబ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట శ్రీకాంత్, నాందేవ్, అశోక్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-కడెం



గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హరిత రిసార్టులో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ప్రజలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించేలా వాలంటీర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలు సైతం ఆర్థిక అక్షరాస్యత వైపు అడుగులు వేసేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలందరికీ రోజు వారి జీవితంలో అవసరమయ్యే ఆర్థిక అంశాలపై అవగాహనను పెంపొందించేలా కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై బ్యాంకు అధికారులు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించే పథకాలు, రుణాలు, బీమా సదుపాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వాలు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తాయని రైతులు మహిళలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకునేలా వారికి వివరించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జన సురక్ష, పీఎం విశ్వకర్మ ముద్ర, పీఎంఈజీపీ, పీఎం జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ యోజన,పీఎం ఎఫ్ఎంఈ, ఇతర వ్యవసాయ రుణాలపై రైతులకు, ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. రుణాలు పొంది వాటిని సక్రమంగా వినియోగించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ మాట్లాడుతూ ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంపొందించేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీడ్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రైతులు, మహిళా సంఘాలు, యువతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, బీమా సదుపాయం, తదితర బ్యాంక్ సేవలు, అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అంతకుముందు వీడ్స్ స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారధి ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు సేవల వినియోగంపై ఏరియా కోఆర్డినేటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత కరదీపికలను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ అరుణ, ఎస్‌బీఐ మేనేజర్ సంతోష్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నరేష్, పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఆదిలాబాద్ : నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నేరవేర్చాలని సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ డిమాండ్ చేశారు. హక్కుల సాధనకు ఉద్యోగులు చేపట్టిన ఆందోళనల్లో భాగంగా రెండవ రోజు శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో మానవహారం చేపట్టారు. చాయ్ పే చర్చ అంటు సీఎం రేవంత్ రెడ్డి మోసపూరిత వాగ్దానాలను ఎండగ్టాడుతూ నినాదాలు చేశారు. సీఎం చిత్రం మెడలో వేసుకొని టీ తాగుతూ రేవంత్ రెడ్డి లాగా మాట్లాడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులు ధర్నాలు చేస్తే తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్న ఎలాంటి చర్యలు లేవన్నారు. తమను రెగ్యులర్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా మండ లస్థాయి విద్య కుంటు పడుతోందని, సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రకాష్, పార్థసారథి, వెంకటి, నరేష్, సోమన్న, రాజన్న, కేశవ్ ఉన్నారు.

నిర్మల్ రూరల్ : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష శనివారం 2వ రోజుకు చేరుకుంది. వీరి దీక్షకు యూటీఎఫ్, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని రెగ్యురలైజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని ఇప్పటికీ ఎలాంటి విది విధానాలు ప్రారంభించలేదని పేర్కొన్నారు.



నిర్మల్ రూరల్ : ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్షలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సంవత్సర పాలనలో పాయల్ చేసిందేమీ లేదు

- బీఆర్ఆర్ జిల్లా అధ్యక్షుడు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నియోజకవర్గ రూపురేఖలు మార్చేల గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయని, తమ హయంలో మంజూరైన పనులకు కొత్తగా కొబ్బరికాయలు కొట్టడం తప్పితే ఏడాది కిందట గెలిచిన స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన నియోజకవర్గ ఎమ్మెల్యే పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది గడిచినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని జోగు రామన్న అన్నారు. తమ హయంలో ప్రారంభమైన పనులు సైతం ముందుకు సాగడం లేదని, నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోందని పేర్కొన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జ్, అండర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులకు నిధులు ఇప్పించలేకపోవడంతో కాంట్రాక్టర్ సామాగ్రితో సహా వెళ్ళిపోయాడన్నారు. కేవలం అబద్ధపు మాటలు, అసత్యపు ప్రచారాలతో ఎమ్మెల్యే కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏరోడ్రం, ఎయిర్ పోర్ట్‌కు అడ్డుపడుతుందని అసత్య ఆరోపణలు చేసి ప్రస్తుత ముఖ్యమంత్రిని ఎందుకు ప్రశ్నించలేకపోతున్నారని అన్నారు. సీసీఐ పునరుద్ధరనపై సైతం గతంలో అనేక మార్లు కేంద్ర మంత్రులను కలిసిన ఫలితం రాలేదని, ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీ అంశాన్ని ఎందుకు ముందుకు తీసుకెళ్లలేకపోతున్నారని ప్రశ్నించారు. జైనథ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి గతంలోనే భూమిపూజ చేసినా తిరిగి ఎమ్మెల్యే భూమిపూజ చేయడం దేనికి నిదర్శనమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు తీసుకురాలేక ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నారని మండిపడ్డారు. కలెక్టరేట్ భవనం, ఐటీ టవర్, బీసీ భవన్, బంజారా భవన్, ఆడిటోరియం వంటి అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇకనైనా అబద్ధపు మాటలు వీడి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేష్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, మార్శెట్టి గోవర్ధన్, బట్టు సతీష్, గంగయ్య, అశోక్, గొండ గణేష్, ధమ్మపాల్, లక్ష్మణ్, పుంద్రు వెంకట్ రెడ్డి, నవతే శ్రీనివాస్, ఉగ్గే విఠల్, వినోద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : అన్వేష్‌రెడ్డి



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. మండలంలోని రైతు భవనంలో ప్రజా పాలన విజయోత్సవ సంబరాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి సంవత్సర కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడపడుచులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500 వంట గ్యాస్, రైతులకు రుణమాఫీ, రైతు బీమా, సబ్సిడిపై రైతులకు విత్తనాలు, ఎరువులు అందించారని తెలిపారు. డీసీసీ అధ్యక్షులు శ్రీ హరీరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రైతు భరోసా, గృహజ్యోతి, ఇంద్రమ్మ ఇండ్లు ఒక్కొక్కటి నెరవేరుస్తున్న రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. అనంతరం మహిళలు రంగవల్లి, బతుకమ్మ సంబరాలు, మహిళా క్రీడలను తిలకించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, తాజా మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హది, వైస్ చైర్మన్ శంకర్ రెడ్డి, రైతు కిసాన్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోతారెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, పార్టీ మండల అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, ఉపాధ్యక్షులు విలాస్ రావు, తేజ్ నాయక్, డైరెక్టర్లు పోతారెడ్డి, ముత్యం రెడ్డి, ముక్తార్, నాగోరావ్, పుష్ప దన్సింగ్, నాయకులు రాజ్ మహమ్మద్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రెడ్డి, నర్సారెడ్డి, సత్యపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-కడెం

మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వద్ద ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్ల కుటుంబాల పట్ల అనాలోచితంగా ఆలోచించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో డ్రైవర్ల కుటుంబాల బ్రతుకులు రోడ్డున పడ్డాయన్నారు. పథకం అమలు చేసి దాదాపు సంవత్సర కాలం గడుస్తున్న తమకు ఎలాంటి న్యాయం చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచ ఏవారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు, ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దేశరక్షణలో ప్రాణాలు కొల్పోయిన సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలో సైనికుల త్యాగాలకు గుర్తుగా సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తొలి విరాళంతో పతాక నిధి సేకరణను ప్రారంభించారు. అనంతరం దేశ రక్షణలో వీరమరణం పొందిన సైనికుల తల్లులను సత్కరించారు. ఇందులో భాగంగా వివిధ కారణాలతో మరణించిన సైనికుల కుటుంబ సభ్యులకు రూ.మూడు లక్షల చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. దేశ రక్షణలో ప్రాణాలు కొల్పోయిన సైనికుల కుటుంబాలకు ఆర్థికంగా సహకరించేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ప్రజలు, విద్యా సంస్థల నుంచి ఎన్‌సీసీ కెడెట్లు హుండి బాక్సుల ద్వారా విరాళాలు సేకరిస్తారని తెలిపారు. ప్రజలు కూడా దేశంతో పాటు ప్రజల రక్షణ కోసం వీరమరణం పొందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ దాస్, జనరల్ కార్యదర్శి దేవన్న, అభయ్ కుమార్, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-కడెం



ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా లింగాపూర్ గ్రామ స్థాయి ఆటల పోటీలను జడ్పీఎస్-ఎస్ లింగాపూర్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూమేశ్వర్, లింగాపూర్ పంచాయతీ కార్యదర్శి మౌనిక పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు గ్రామస్థాయి ఆటల పోటీల్లో బాల, బాలికల విభాగంలో ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులను త్వరలో జరిగే మండల స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో లింగాపూర్ పాఠశాల పీడీ ప్రభాకర్, గ్రామ విద్యాకమిటీ ప్రెసిడెంట్ రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ హౌస్

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నిర్మల్ పట్టణంలోని సోమవార్‌పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, మెటల్ డిటెక్టర్, బాంబు నిర్వీర్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో డీఎస్పీ ప్రభాకర్, సీఐ ప్రవీణ్ కుమార్, ఇన్స్‌పెక్టర్ శేఖర్, ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

పోలీస్ శాఖలో పనిచేస్తున్న హోంగార్డులకు రోజువారి జీతభత్యాలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా హోంగార్డు సిబ్బంది శనివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హోంగార్డుల సేవలను గుర్తించి జీతాలు పెంచడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హోంగార్డులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఈనెల 9న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించే ఆదివాసుల పోరాట దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక అన్నారు. మావల మండల కేంద్రంలోని కుమురం భీం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదివాసీ చట్టాలు, హక్కులు జీఓలన్నీ కాలరాస్తూ ఆదివాసుల సాంస్కృతి సాంప్రదాయాలపై దాడులను తిప్పికొడుతూ అస్తిత్వాన్ని కాపాడుకునేల ఈనెల 9న హైదరాబాద్, ఢిల్లీ, ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసులు ఎక్కడికక్కడ జెండాలు ఎగురవేయాలన్నారు. ఇందులో భాగంగానే ఇంద్రవెల్లిలోని రగల్ జెండా ఆదివాసుల పోరాట దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉద్యక్షురాలు ఉయిక ఇందిర, డివిజన్ అధ్యక్షురాలు సోయం లలితబాయి, మండల అధ్యక్షురాలు శాంతాబాయి, మండల ఉపాధ్యక్షులు ఎడమ మానుకు బాయి, చాకటి అనసూయ బాయి పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | డిసెంబర్ 08, 2024 | www.navatelangana.com

సైలెన్సర్లు మార్చితే కఠిన చర్యలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



వాహనాలకు కంపెనీతో వచ్చే సైలెన్సర్లను మార్చి పట్టణంలో శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వారిపై ఇక నుండి కఠినచర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో కంపెనీ సైలెన్సర్లను తొలగించి వాటి స్థానంలో అధిక శబ్దం వినిపించే సైలెన్సర్లతో వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైలెన్సర్లను మార్చడం చటరీత్యా నేరమని, ఇక నుండి ప్రతి రోజు తనిఖీలు చేసి ఇలాంటి వాహనదారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణంలోని మెకానిక్‌లు కూడా సైలెన్సర్ల మార్పును ప్రోత్సహించొద్దని, ఇలాంటి చర్యలకు సహకరించిన మెకానిక్‌లపై కూడా చర్యలుంటాయని హెచ్చరించారు.

పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా విడుదల

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా విడుదల చేసినట్టు ఎంపీడీఓ అంజద్ పాషా తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంతో పాటు ఆయా పోలింగ్ స్టేషన్లలో ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అన్ని నియమ నిబంధనలు పాటించి పోలింగ్ స్టేషన్ల రూపకల్పన చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ సహాయకులు రామకృష్ణ ప్రసాద్, వివిధ పంచాయతీల కార్యదర్శులు సతీష్ రావు, తరుణ్ గౌడ్, పవన్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఇంటి ముందు కార్మికుల బైఠాయింపు

- గ్రూపులు చేపిస్తానని చెప్పి డబ్బులు కాజేశాడని ఆరోపణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర మున్సిపాటిటీలో మంచినీటి సరఫరా విభాగంలో పని చేసే కార్మికులు శనివారం ఆరో వార్డు కౌన్సిలర్ పిర్సింగుల జయచందర్ ఇంటి ముందు బైఠాయించారు. నాలుగేండ్ల క్రితం కార్మికులకు సంబంధించిన గ్రూపుల రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని చెప్పి తమ నుండి డబ్బులు వసూలు చేసి ఇప్పటి వరకు గ్రూపుల రిజిస్ట్రేషన్ చేయలేదని వారు ఆరోపించారు. మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా విభాగంలో పని చేసే 32 మంది కార్మికులు ఉండగా, ఇందులో ఒక్కో కార్మికుని నుండి రూ. 1500 చొప్పున కౌన్సిలర్ జయచందర్ వసూలు చేశాడు. కార్మికులకు సంబంధించిన గ్రూపుల రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని చెప్పడంతో తాము అతనికి ఇచ్చామని, నాలుగేండ్లు పూర్తయ్యినా ఇప్పటి వరకు డబ్బులు తిరిగి ఇవ్వలేదని, గ్రూపుల రిజిస్ట్రేషన్ కూడా చేయలేదని వారు వాపోయారు. గత్యంతరం లేక కౌన్సిలర్ ఇంటి ముందు నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కౌన్సిలర్‌ను వారు ప్రశ్నించారు. డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పడంతో కార్మికులు వెళ్లిపోయారు.

12 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఎలకపల్లి-బి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉన్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎలుకపెల్లి-బి గ్రామంలో శుక్రవారం తనిఖీలు చేశారు. అక్రమంగా నిల్వ ఉన్న 12 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని, స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తెలిపారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రైలు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన సిర్పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్లే హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వృద్ధురాలు అబ్బాస్ బేగం(80) కొన్ని రోజుల నుండి మతిస్థిమితం కోల్పోయింది. దీంతో ఆమె బయటికి వెళ్లి భిక్షాటన చేసి సాయంత్రం ఇంటికి వచ్చేది. శుక్రవారం ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం సిర్పూర్ రైల్వే సమీపంలో ఏదో గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. కుతూరు ముంతాజ్ బేగం అప్పజెప్పినట్లు తెలిపారు.

రైల్వే ఎన్నికలలో విజయం సాధిస్తాం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 4, 5 తేదీలలో జరిగిన దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలలో ఎంప్లాయిస్ సంఘ్ విజయం సాధిస్తుందని ఆ సంఘం కాగజ్‌నగర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి వై సతీష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, అధిక సంఖ్యలో కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఈ నెల 12 ఫలితాలు వెలువడనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సాంబయ్య, వైస్ ఛైర్మన్ తిరుపతి, కోశాధికారి నర్సయ్య, నాయకులు జీవరత్నం, నితీష్‌కుమార్, వెంకటప్ప, విష్ణు, మనోహర్, సుధాకర్, నిరంజన్, రాజ్‌కుమార్ యాదవ్, రాజేష్, నందుకుమార్, రాంభజన్ మీనా, నిరంజన్ పాల్గొన్నారు.

విద్యార్థిని శైలజ మరణం దురదృష్టకరం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో గల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని శైలజ మరణం దురదృష్టకరమని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా శనివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఆసిఫాబాద్, మంచిర్యాల, హైదరాబాద్‌లో గల ప్రముఖ ప్రయివేటు ఆస్పత్రులలో వైద్యం అందించడానికి గిరిజన సంక్షేమ శాఖ, ఐడీటీఏ ద్వారా రూ. 28 లక్షలు ఖర్చు చేశామన్నారు. పాఠశాల విద్యార్థిని శైలజకు మంచిర్యాల, హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయడం జరిగిందని, ఈ చికిత్సకు మంచిర్యాలలో రూ. 3 లక్షలు, హైదరాబాద్‌లో రూ.10 లక్షలు ఖర్చు చేశామని వివరించారు. శైలజ అంత్యక్రియల సమయంలో రూ. 1 లక్ష కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో శైలజ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం, రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేశామని పేర్కొన్నారు.

మంత్రి సీతక్క, డీసీసీలకు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను కలిసి సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కలిసికట్టుగా పనిచేద్దామని తెలిపారు. దీనికోసం పార్టీ శ్రేణులను ఏకం చేద్దామని సూచించారు. మాజీ ఎమ్మెల్యే చేరిక పార్టీకి బలాన్ని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటమి గెలుపుకు నాంది

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓటమి గెలుపుకు నాంది లాంటిదని క్రీడాకారులు తాము పాల్గొనే పోటీలలో క్రీడాస్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలో భాగంగా శనివారం మండలంలోని వట్టివాగు, ఆర్అండ్ఆర్ కాలనీ (పాడింబండ) గ్రామాల్లో గ్రామపంచాయతీ స్థాయి సీఎం కప్-2024 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కప్-2024 క్రీడా పోటీలను గ్రామపంచాయతీ, మండల, జిల్లా స్థాయిలలో నిర్వహించి ఆయా స్థాయిలలో ఉత్తమ ప్రతిభతో మెరుగైన ప్రదర్శన ఇచ్చిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు ఆటలలో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. జిల్లాలో క్రీడాకారులకు కొదువ లేదని, జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది క్రీడా రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ క్రీడల అధికారి మీనారెడ్డి, మాజీ ఎంపీటీసీ శంకర్, మాజీ సర్పంచ్ దినకర్, పీఈటీలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : వాలీబాడ్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కౌటాల : సీఎం కప్ కోసం గ్రామ స్థాయిలో క్రీడలు ప్రారంభించి విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ గావుడె హన్మంతు ఆకాంక్షించారు. శనివారం మండలంలోని గుండాయిపేట్ గ్రామాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొడెం నానాజీ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి కబడ్డీచ ఖోఖో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ గావుడె హన్మంతు పాల్గొని విద్యార్థులు గ్రామ స్థాయిలో పలిభ కనబరిచిన విద్యార్థులను మండల స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. అక్కడ రాణించిన వారిని జిల్లా స్థాయికి పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, విద్యార్థులు పాల్గొన్నారు.



కౌటాల : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ

వేతనాలు పెంచకుంటే ప్రజా భవన్ ముట్టడిస్తాం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-రెబ్బెన

సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం అదికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం చాల బాధాకర విషయమని, డిసెంబర్ 9లోగా వేతనాలు పెంచకుంటే 10న ప్రజా భవన్‌ను ముట్టడిస్తామని ఎస్‌సీకేఎస్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ హెచ్చరించారు. శనివారం బెల్లంపల్లి ఎరియా గోలేటిలో సీఐటీయూ కార్యాలయంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం గోలేటి బ్రాంచి సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచడంతో సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేవారు. ఇందులో సంఘం గోలేటి బ్రాంచి గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, సింగరేణి ప్రయివేట్ సెక్యూరిటీగార్డ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాజశేఖర్, నర్సరీ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, కమిటీ సభ్యులు శారదా, అనితా, చిన్ను బాయి, స్రవంతి పాల్గొన్నారు.

నూతన నేర న్యాయ చట్టాలపై అవగాహన ఉండాలి

- ఏఎస్పీ ప్రభాకర్ రావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నేర న్యాయ చట్టాలపై పోలీసులు అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు సూచించారు. నేర న్యాయ అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భారత న్యాయ సహిత చట్టాలపై పోలీసులకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రమణారెడ్డి, జగన్ మోహన్ రావు, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ఎస్ ప్రసాద్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు మరింత వేగంగా పూర్తి చేయొచ్చన్నారు. వీటిపై కింది స్థాయి వరకు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నూతన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడమే కాకుండా వాటి సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. నూతన నేరన్యాయ చట్టాలు-2023 ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతులలో మార్పు వచ్చాయని, ప్రజలకి మరింత సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం నూతన చట్టాలలో కల్పించబడిందన్నారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది నూతన నేరన్యాయ చట్టాలలోని అంశాలపై సంపూర్ణ అవగాహన, పరిజ్ఞానం కలిగి ఉండేందుకు ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందనీ అయిన న్యాయ నిపుణుల చేత అవసరమైనప్పుడు ఒరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ అమలులో ఉన్న విధానాలను పూర్తిగా నూతన చట్టాలుగా మార్చడం లేదని, ప్రస్తుత సమాజాన్ని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసుల నమోదు తీరు, శిక్షల విధింపు, విచారణ పద్ధతులను వేగవంతం చేయడానికి అవసరమైన మేరకు పలు అంశాలను ఈ నూతన నేరన్యాయ చట్టాలలో మార్చడం జరిగిందన్నారు. అనంతరం పీపీ రమణారెడ్డి కొత్త చట్టాలలో వచ్చిన మార్పులను అధికారులకు, సిబ్బందికి వివరించడంతో పాటు వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కేసుల కన్విక్షన్‌లో పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఏదైనా కేసులో కేసు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మొదలు విచారణ, కన్విక్షన్ అయ్యేవరకు పోలీసుల పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు. అదేవిధంగా నూతన చట్టాల ప్రకారం ఏదైనా కేసు విచారణలో కోర్టులో ఎదురవుతున్న వివిధ సమస్యలను పోలీసు అధికారులకు వివరించి వాటిని నివృత్తి చేయడంలో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి వివరించచారు. ఎన్డీపీఎస్ చట్టం గురించి కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, సీఐలు బుద్ధ స్వామి, శ్రీనివాస్, సత్యనారాయణ, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రభాకర్ రావు

నేటి నుంచి ఆటో జాత ప్రారంభం : సీఐటీయూ



మాట్లాడుతున్న వెలిశాల క్రిష్ణమాచారి

నవతెలంగాణ-రెబ్బెన

జిల్లా వ్యాప్తంగా 8,9,10 తేదిల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై ఆటో జాతను నిర్వహించనున్నట్టు, దీన్ని కార్మికులు జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి కోరారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో యూనియన్ మండల కార్యదర్శి విజయ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ఆటో జాత కార్యక్రమాన్ని రెబ్బెన మండలం నుండీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాయ ఆటో జాతను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట డిసెంబర్ 16,17న వంటావార్పు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలో మూడు రోజుల పాటు ఆటో జాత తిరగనుందన్నారు. ఈ జాతాను జిల్లాలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులందరూ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల కార్యదర్శి విజయ, కమిటీ సభ్యులు లక్ష్మీ, స్వరూప, భూమక్క, నారాయణ పాల్గొన్నారు.

జోడేఘాట్‌లో పెద్దపులి సంచారం

నవతెలంగాణ-కెరామెరి

మండలంలోని జోడేఘాట్ అటవీ ప్రాంతంలో శనివారం పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. గ్రామ సమీపంలోని కుమురం భీం మ్యూజియం వెనకాల పంట పోలంలో పులి రైతు కంటపడిందని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం జోడేఘాట్‌కు చెందిన వ్యక్తి తన పంట చేనుకువెళ్ళాడు. మంచెపై నుండి చేను కాపలాగా ఉన్న సమయంలో చేనులో సంచారిస్తున్న పెద్ద పులిని చూసి భయంతో గ్రామంలోకి పరుగులు తీశాడు. తన పంట చేనులో పెద్ద పులి సంచారిస్తున్న విషయాన్ని గ్రామస్తులకు తెలిపాడు. అడవిలో పులి తిరుగుతుందనే వార్తా గుప్పుమనడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పులి సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

చిరుత దాడిలో ఆవు మృతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చిరుత పులి దాడిలో ఆసిఫాబాద్ మండలం గంటలగూడెం అటవీ ప్రాంతంలో ఆవు మృతి చెందింది. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన బాధితుడు బానోత్ రాములకు చెందిన పశువులు మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా చిరుత దాడి చేసి ఆవును చంపేసింది. విషయాన్ని అటవీ అధికారులకు తెలియజేయడంతో జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, సెక్షన్ అధికారులు మహేందర్, చంద్రకాంత్, బీట్ అధికారులు సాదిక్, స్వప్న, మారుతీలు అక్కడికి చేరుకొని పరీక్ష చేసి చిరుత పులిగా నిర్ధారించారు. బాధితునికి అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ ప్రజలు పులి సంచారానికి సంబంధించిన సమాచారం ఉంటే తెలియజేయాలన్నారు. అటవీశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పులికి సంబంధించిన సమాచారాన్ని తెలుపుతామని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో ఆనిమల్ ట్రాకర్ సాయితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- పీసీసీఎఫ్ డోబ్రియాల్



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

వన్యప్రాణుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఆర్‌కే డోబ్రియాల్ అన్నారు. శనివారం పెంచికల్‌పేట్ రేంజ్ పరిదిలోని కొండఎల్లి అటవీ ప్రాంతాన్నీ, పెంచికల్‌పేట్ రేంజ్ పరిదిలో గల బోల్ మెత్తం గడ్డి క్షేత్రాన్ని, గుండపల్లి బేస్ క్యాంప్ ట్రైగర్ మూమెంట్ ఏరియా పాలరాపు గుట్ట వద్ద రాబందుల ఆవాసాలను పరిశీలించారు. వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, వన్యప్రాణుల నుండి ప్రజలకు హాని కలుగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పులి సంచారంపై అప్రమత్తంగా ఉంటూ ప్రజలను అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కూడా అటవీ శాఖ అధికారులకు సహకరం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ ఏలూసింగ్ మేరు, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, కాగజ్‌నగర్ డివిజన్ అధికారి విజయ్ కుమార్ సాబు, లైంగ్ స్కాడ్ ఎఫ్‌డీపీ వేణుబాబు, ఎఫ్ఆర్ఓ అనిల్ కుమార్, లైంగ్ స్కాడ్ ఎఫ్ఆర్ఓ రమాదేవి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మోడల్ ఇందిరమ్మ ఇల్లు



నవతెలంగాణ-వాంకిడి

జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఒకటి చొప్పున నమూన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టడానికి హౌసింగ్ అధికారుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. దీంతో వాంకిడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ వీ.ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీఓ జావీద్‌తో కలిసి ఇంటి నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని శనివారం పరిశీలించి చదును చేయించారు.

తాటినగర్‌లో డప్పు చాటింపు

నవతెలంగాణ-కౌటాల



పులుల సంచారం నేపథ్యంలో మండలంలో తాటి నగర్ గ్రామంలో 2 పులుల సంచరిచ్చినట్టు గ్రామస్తులు తెలిపిన ఈ మేరకు శనివారం కార్యదర్శి తిరుపతమ్మ గ్రామంలో డప్పు చాటింపు వేయించారు. పులి సమాచారంతో గ్రామస్తులు పొలాల్లో చేనులో వెళ్లాలంటే జంకుతున్నారు. గ్రామస్తులు పొలాల్లో రెండు పులులు అడుగులు చూసినట్లు ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అధికారులు గ్రామంలో చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

నవతెలంగాణ-జన్నారం



మండలంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు రాంపూర్, తిమ్మాపూర్, చింతగూడ, కవ్వాల్, కలమడుగు, ఇందన్‌పల్లి, ధర్మారం గ్రామాల్లో పీఏసీఎస్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిచిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టార్పాలిన్ కవర్లను దాన్యం కుప్పలపై కొంతవరకు తడవకుండా జాగ్రత్త పడ్డారు. అయినా చాలా కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిచి ముద్దయింది. ప్రభుత్వం లేటుగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతోనే ఈ సమస్య తలెత్తిందని రైతులు వాపోతున్నారు. తడిసిన వరి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కోనో కార్పస్ చెట్ల తొలగింపు

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలోని ప్రధాన రహదారి డివైడర్‌ల మధ్య ఉన్న కోనో కార్పస్ చెట్లను మంచిర్యాల మున్సిపల్ అధికారులు తొలగించారు. కోనో కార్పస్ చెట్ల నుంచి వచ్చే పుప్పొడితో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్న నెపద్యంలో చెట్లను తొలగిస్తున్నామని, ప్రజల అనారోగ్యానికి కారణం అయ్యే ఈ చెట్లు పట్టణంలో ఎక్కడ ఉన్న పెద్ద సైజులో గుబురుగా పెరిగిన చెట్లను తొలగించి చిన్న సైజులో చెట్లు ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ విధుల్లో మందు బాబులు



నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టు బడిన మందు బాబులకు శనివారం ట్రాఫిక్ రూల్స్ పై అవగాహనా కల్పించారు మంచిర్యాల పట్టణ ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ. ఈ మధ్యకాలంలో మద్యం సేవించి వాహనన్ని నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని శుక్రవారం మంచిర్యాల కోర్టులో హాజరు పరుచగా సెకండ్ అడిషనల్ జూనియర్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిరోషా ఎనిమిది మందికి జైలు శిక్ష, మరో పది మందికి పది రోజుల పాటు తదితర ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పును ఇచ్చారు. ఈ మేరకు శనివారం మంచిర్యాల పట్టణంలోని పలు చోట్ల మందు బాబులకు ట్రాఫిక్ విధులను కేటాయించి శిక్షను అమలు పరచినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనం నడుపుతున్నపుడు తప్పనిసరిగా హెల్మెట్, ఫోర్ విల్లర్‌లో ప్రయానించేటపుడు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో 100 శాతం లోపు వచ్చిన వారికి ఫైన్, ఆ పైన వచ్చిన వారికి తదితర శిక్షలు అమలుపరుస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నందయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం గురుకులాలను భ్రష్టుపట్టిస్తోంది

● బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను భ్రష్టు పట్టిస్తోందని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేష్ అన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా శనివారం జైపూర్, చెన్నూర్ పట్టణాలలో గల గురుకుల పాఠశాలలను సందర్శించారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందించకపోవడంతో ఫుడ్ పాయిజన్‌తో ఇప్పటి వరకు రాష్ట్రంలో 48 మంది విద్యార్థులు మృతి చెందారని ఆవేధన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు చదువు అవసరం లేదన్నట్లుగా రేవంత్ రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తూన్నారని విమర్శించారు. విద్యార్థుల తల్లితండ్రులు అర్థం చేసుకోవాలని పేద పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఈజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు బడికెల సంపత్, జైపూర్ మండల మాజీ జడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, పీఏసీఎస్ చైర్మెన్ సాంబగౌడ్ పాల్గొన్నారు.



లక్షెట్టిపేట : పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నడిపెల్లి దివాకర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏవిదంగా సౌకర్యాలు ఉన్నాయో ఇప్పుడు అదే తరహాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలల యొక్క భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 11 నెలలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో దాదాపు 50 మంది విద్యార్థులు వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన గురుకుల పాఠశాలలో శైలజ అనే విద్యార్థిని కలుషిత ఆహారం తిని 21 రోజులు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయికందని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వంలో గురుకుల పాఠశాల నిర్వహణలో పేద వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల కోసం 11 వందల గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి, అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యను అందించాలని ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాల వ్యవస్థను చిన్న భిన్నం చేయడానికి కాంగ్రెస్ కంకణం కట్టుకుందని మివర్శించారు. ఈ గురుకుల వ్యవస్థని నిర్వీర్యం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, బీఆర్ఎస్‌వీ నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామంలో హనుమాన్ ఆలయంలో శనివారం మాజీ అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరికృష్ణ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. వీరి వెంట పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్, మేడారం ప్రదీప్, గోవర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, అమర వేణి నర్సాగౌడ్, గంగారెడ్డి, ఎంపీటీసీ విక్రం, అనుముల భాస్కర్, కొప్పుల శ్రీధర్, రమేష్ ఉన్నారు.

గ్రామస్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో సీఎం కప్ క్రీడా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు జిల్లా యువజన క్రీడల అధికారి రాజ్వీర్ చేతుల మీదుగా ప్రారంభించారు. మొదటి రోజు కబడ్డీ,వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా సోమవారం గ్రామస్థాయి పోటీలు ముగియనున్నాయి. ఇక గ్రామస్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని మండల స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు 10, 11 తేదీల్లో జరగనున్నాయి. ఈ పోటీల ప్రారంభోత్సవంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలను త్వరగా గోదాంలకు చేర్చాలి

నవతెలంగాణ-జన్నారం

ధాన్యం బస్తాలను త్వరగా గోదాంలకు చేర్చాలని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో శనివారం ఆయన కిష్టాపూర్, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, డీఆర్డీఏ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలు పడుతున్న దృష్ట్యా తడవకుండా ధాన్యంపై కవర్లు కప్పాలని రైతులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బుచ్చన్న అధికారులు, రైతులు ఉన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.13 కోట్ల 67 లక్షల జమ

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో 315 వరి ధాన్యం కొనుగోలు ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి రూ.13 కోట్ల 67 లక్షల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 315 కొనుగోలు కేంద్రాల ద్వారా 14 వేల 191 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో 1 వేయి 859 టన్నుల సన్నరకం ధాన్యం ఉందని, సంబంధిత 914 మంది రైతుల ఖాతాలలో రూ.13 కోట్ల 67 లక్షల జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 14 రైస్ మిల్లులకు సీఎంఆర్ అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలినివేయడం జరుగుతుందని ఏఈ స్వర్ణలత తెలిపారు. బెల్లంపల్లిలో 182/33 కేవీ సబ్ స్టేషన్‌లో పాత కండక్టర్ తీసి వేసి, కొత్తది మారుస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవినీతి రహిత సమాజాన్ని స్థాపిద్దాం

నవతెలంగాణ-మంచిర్యాల

సమాజంలో ఎక్కడ చుసిన అవినీతి పేరుకు పోయి ప్రజాస్వామ్యం బలహీన పడుతుందని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, నాయకవాది మోతె రాజలింగున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసెంబర్ 8న నిర్వహించే అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కొన్ని శతాబ్దాలుగా అవినీతి పెచ్చరిళు ్తతుందని, అది సమాజంపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతుందని, ఆర్థిక అభివృద్ధిని అణచివేస్తుంధన్నారు. ప్రభుత్వ అధికారులు అంకితభావం, ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పాన్ని మరచి లంచాలకు అలవాటు పడ్డారని, లంచం తీసుకుంటూ ఆదాయానికి మించి ఆస్తులు కూడ పెడుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడినప్పటికీ ఉద్యోగం ఉంటుందనే ధీమాతో వారి వైఖరి మారడం లేదన్నారు. లంచం తీసుకుంటు పట్టుబడిన అధికారుల కొన్ని కేసులు పలు కారణాలతో వీగిపోతున్నాయని అందువల్లే అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ నాయకులు ఆడెపు సురెందర్, కాగితపు సునీల్, నడిపెల్లి సునీల్ రావు పాల్గొన్నారు.



యాసంగి జాగ్రత్తలపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

యాసంగిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి రైతులకు అవగాహన కల్పించారు. శనివారం మందమర్రి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి యాసంగిలో వరి విత్తనాల ఎంపిక, నారు మడి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ తక్కువ కాల పరిమితి కలిగి వివిధ చీడ పీడలను తట్టుకొనే మేలైన విత్తనాలను డిసెంబరు నెలలో నార్లు వేసుకోవాలన్నారు. ఎకరాకు రెండు గుంటల నారు మడిని రెండు మూడు సార్లు బాగా దున్ని, చదును చేసి 1.5 నుండి 2 మీటర్ల వెడల్పుతో 4 నుంచి 6 ఇంచుల ఎత్తులో పొడవాటి బెడ్లుగా తయారు చేసుకొని నీటిని తీసివేయుటకు కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పీఎస్‌బీ లాంటి మణులు వేసుకోవాలని, వరి విత్తనాలను ట్రీకోడెర్మ, సూడోమోనాస్ మందులతో శుద్ధి చేసి ఒక రోజు నీటిలో నానబెట్టి 4 నుంచి 6 రోజులు మండే కట్టిన నారును బురద నారు మడిలో అలుకుకోవాలని సూచించారు. మొలక అలికే సమయంలో ఒక ఎకరా నారుమడికి 2 కిలోల డీఏపి, 1.5 కిలోల యూరియా, 0.5 కిలోల పోటాష్ వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రాయమల్లు, రాజన్న, వేణు, పర్వతాలు, జయమ్మ, శ్రీను, చంద్రయ్య పాల్గొన్నారు.

నూతన 108 అంబులెన్స్ ప్రారంభం

నవతెలంగాణ-నస్పూర్

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మంచిర్యాల జిల్లాకు కేటాయించిన 108 అంబులెన్స్‌ను శనివారం జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు మూడు అంబులెన్స్‌లను కేటాయించారని, ఈ మూడు అంబులెన్సులు హాజీపూర్, తాండూర్, భీమారం మండలాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా సత్వర వైద్య సేవలకు అత్యవసర కేసులకు 15 నిమిషాల లోపలనే 108 అంబులెన్స్ అందుబాటులో ఉంటుందన్నారు. అదేవిధంగా 102 అమ్మఒడి అంబులెన్సులు మూడింటిని జిల్లాకు కొత్తవాటిని ఇవ్వడం జరిగిందని, వీటిని చాలా రోజుల నుండి నడుస్తున్న పాత అంబులెన్స్ స్థానంలో హాజీపూర్, దండేపల్లికి కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాకు మొత్తం 18 అంబులెన్సులు ప్రజలకు వైద్య సేవలు అందిస్తాయన్నారు. నూతన అంబులెన్సు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, 108 జిల్లా మేనేజర్ సంపత్ తెలంగాణ ప్రభుత్వానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



అభయారణ్యంలో పర్యటించిన పీహెచ్‌డీ విద్యార్థులు



నవతెలంగాణ-జన్నారం

మండలం కవ్వాల్ అభయారణ్యంలో హైదరాబాదులోని సీసీఎంబీ పీహెచ్‌డీ విద్యార్థులు పర్యటించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా వారు శనివారం జన్నారం మండలం గోండుగూడా, బైసన్ కుంట, వాచ్ టవర్, తదితర ప్రదేశాలను పరిశీలించారు. అభయారణ్యం, వన్యప్రాణుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వారికి అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన కనవేణి శ్రీనివాస్(38) శనివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పి ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ ప్రయివేట్ ఎలక్ట్రిషియన్‌గా విధులు నిర్వహిస్తు కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. గత కొద్దిరోజుల నుండి శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. పలు సార్లు హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో మనస్థాపానికి గురై శనివారం ఇంట్లో నుండి బయటకు వెళ్లి జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య పుష్పలత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల వారిగా అర్హులైన వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేయడం జరుగుతుందని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరుక శనివారం స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమం ప్రారంభించారు. అధికారుల ఆదేశాల మేరకు ప్రాధాన్యతా క్రమంలో అత్యంత నిరుపేదలైన వారికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి, అర్హులైన మిగితా వారికి రెండవ ప్రాధాన్యతగా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-జైపూర్

అతి తక్కువ పెన్షన్‌తో పాటు పరిమితమైన వైద్య సేవలతో సతమతమవుతున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోల్‌మైన్స్ అసోసియేషన్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర స్థాయి సమావేశానికి హాజరైన జాతీయ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజ్ బోర్డు సలహా బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. బొగ్గు కార్మికుల పెన్షన్ పెంచడంతో పాటు అపరిమతమైన వైద్య సేవలు అందించేందకు ఐఎన్‌టీయూసీ కృషి చేయాలని కోరుతూ కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబురావు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాదవ్, వెంకట రమణ వినతి పత్రం అందజేశారు.

పరిపాలనలో మార్పులంటే ఇదేనా..?

● బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేష్



నతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పరిపాలనలో మార్పులు తీసుకురావడం అంటే తెలంగాణ తల్లి విగ్రహం రూపు రేఖలు మార్చడమేనా అని బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్ విమ్మర్శించారు. శనివారం చెన్నూర్ పట్టణంలో గల తెలంగాణ తల్లి విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయడాన్ని బీఆర్ఎస్ ఖండిస్తోందని అన్నారు. విగ్రహంలో తలపై ఉండే కిరీటం, మెడలో ఉండాల్సిన హారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దొంగలించే పనిలో పడ్డారని అన్నారు. తెలంగాణ మహిళలు అతి పెద్దగా జరుపుకునే బతుకమ్మ పండగ, కాగా తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో ఉండే బతుమక్మను మాయం చేయాలని చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆంధ్ర పాలకుల చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తున్నాడని విమ్మర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్, మాజీ సర్పంచ్, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
5
ఆదివారం | డిసెంబర్ 08, 2024 | www.navatelangana.com

ఆదివాసుల ఆప్తమిత్రుడు బీడీ శర్మ

నవతెలంగాణ-కెరమెరి



ఆదివాసీ హక్కుల పోరాట ఉద్యమకారుడు, మాజీ ఐఏఎస్ బ్రహ్మ దేవ్ శర్మ 9వ వర్ధంతిని శనివారం మండలంలోని జోడే ఘాట్‌లోని కుమురం భీం మ్యూజియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ మాట్లాడుతూ ఆదివాసుల హృదయాలలో చెరిగిపోని ముద్ర వేసిన ఐఏఎస్ అని తెలిపారు, బీడీ శర్మ అణచివేతకు గురవుతున్న అడవి బిడ్డలకోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. పీసా, అటవీ చట్టం, మొదలైనవి రూపకల్పన చేయడంలో ఆదివాసుల న్యాయబద్ధమైన హక్కులు పరిరక్షణలో కీలక పాత్ర పోషించినట్లు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మోతీరాం, సోనేరావు, మారుతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-వాంకిడి



విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ నాయకులు కోరారు. శనివారం తెలంగాణ విద్యాశాఖ కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను విన్నవించి రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు మోహన్, ప్రధాన కార్యదర్శి తుకారాం, మీడియా ప్రతినిధి గేడేకర్ సంతోష్, సందీప్, రవి, తులసిరాం, వెంకటరమణ పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన రిలే దీక్షలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యాశాఖలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలంటూ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే దీక్షలు రెండో రోజు కొనసాగాయి. జిల్లా పర్యటనకు వచ్చిన పాఠశాల విద్యాశాఖ కమిషన్ సభ్యులు డాక్టర్ చారుకొండ వేంకటేశ్వర రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా ఆయనను కోరారు. గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మోహన్, జిల్లా అధ్యక్షురాలు శృతిక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందరపు నాగసుధ, ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, కోశాధికారి నగేష్, జిల్లా అధికార ప్రతినిధి పవన్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, సీసీఓ అధ్యక్షుడు అనూప్ కుమార్, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సీఆర్పీల జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, ఐఈఆర్పీల అధ్యక్షుడు వెంకటరమణ, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, మెసెంజర్ అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు టీయూటీఎఫ్ మద్దతు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 6 నుంచి కలెక్టరేట్ ముందర సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు, నిరవధిక సమ్మెకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంపూర్ణ మద్దతును తెలియజేసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేసి టైంస్కేల్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన ఫారెస్ట్ అధికారులు



నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్ర వన్య ప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడిగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నియామకం అయిన సందర్భంగా శనివారం క్యాంపు కార్యాలయంలో బీర్సాయిపేట ఫారెస్ట్ రేంజ్ అధికారులు కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ఫారెస్ట్ అధికారులతో సమావేశమై పలు ఫారెస్ట్ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు, బీట్ ఆఫీసర్‌లు ఉన్నారు.

పాన్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగులు ఆధాయ పన్ను శాఖ నిబంధన మేరకు తమ పాన్ కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు బెల్లంపల్లి ఏరియాలో సుమారు 15 మంది ఉద్యోగులు తమ పాన్ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేదన్నారు. దీని జాప్యం కొనసాగితే ఆధాయ పన్ను నిబంధన ప్రకారం అదనంగా 20 శాతం జరిమానా కూడా విధించబడుతుందన్నారు. పాన్ కార్డు ఆధార్ లింక్ లేని వారు ఇంత వరకు ఐటీ రిటర్న్స్‌కు దాఖలు చేసుకోలేదన్నారు. ఇప్పటికైనా అనుసందానం చేసుకుంటే డిసెంబర్ 31 వరకు ఐటీ రిటర్న్స్ దాఖలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

జిల్లాలో భారీ వర్షం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది ఆసిఫాబాద్‌తో పాటు కాగజ్‌నగర్, కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లో గంటపాటు భారీ వర్షం కురిసింది. జిల్లాలో వరి పంట కోతలు పూర్తయి వడ్లు అరబోసిన రైతులు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల ధాన్యం తడిచి ముద్దైంది. పత్తి కూడా ఏరుతున్న తరుణంలో వర్షం రావడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్బీఐ, యూబీఐ, కెనరా బ్యాంకు ఖాతాలు తీసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగులు ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకుల్లో ఖాతాలు తీసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్బీఐ, యూబీఐ, కెనరా బ్యాంకుల్లో ఖాతా ఉంటే రూ. కోటి ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఆయా బ్యాంకులతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఆయా బ్యాంకుల్లో అకౌంట్ లేని వారు ఇప్పటికైనా తీసుకోవాలని కోరారు. ఏదైనా కారణం వల్ల ప్రస్తుత బ్యాంకు నుంచి పైన పేర్కొన్న బ్యాంకులకు మార్చుకోవడం ఇష్టం లేని వారు సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారులకు లేఖ రాసి ఇవ్వాలన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతం దిశగా చర్యలు

- రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేశ్వర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా విద్యా కమిషన్ ప్రత్యేక దృష్టి సారిస్తుందని రాష్ట్ర విద్య కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేశ్వర్ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలలను సందర్శించడం జరిగిందని, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు అందిస్తున్న బోధన, వసతుల కల్పన అంశాలపై రాష్ట్రమంతా పర్యటించి ప్రభుత్వానికి నివేదికలు అందించడం జరుగుతుందని తెలిపారు. సుమారుగా 600 గురుకులాలు, ప్రయివేట్ భవనాలలో కొనసాగుతున్నాయని విద్య కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించడం, సబ్జెక్టుల వారీగా బోధించేందుకు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం జరిగిందని తెలిపారు. అన్ని ప్రభుత్వ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన రుచికరమైన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. అన్ని జిల్లాలకు రెగ్యులర్ జిల్లా విద్యాధికారులను నియమించేందుకు కమిషన్ చర్యలు చేపడుతుందన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపొందించడంతో పాటు ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించడం జరుగుతుందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రయివేట్, కార్పొరేట్లకు ధీటుగా నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఉపాధ్యాయులు తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి విద్యార్థి అభివృద్ధి చెందేలా, వారికి అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

శత శాతం లక్ష్యంగా ముందుకు సాగాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు శతశాతం లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో వార్షిక పరీక్షల నిర్వహణ, ఫలితాల సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలలో అత్యున్నత ఫలితాలు సాధించి జిల్లాను ముందు వరుసలో ఉండేలా అధ్యాపకులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ గురుకుల కళాశాలలు 48 ఉన్నాయని, విద్యార్థుల హాజరు శాతం పెంపొందించి క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, వార్షిక పరీక్షలకు ఇంకా 80 రోజులు మాత్రమే ఉన్నాయని, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ఈ క్రమంలో కార్యచరణ రూపొందించుకొని ఆ ప్రకారంగా విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి అపోహలు, భయం లేకుండా పరీక్షలకు హాజరయ్యే విధంగా మనోధైర్యాన్ని కలిగించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కళాశాలలో అదనపు తరగతులు నిర్వహించాలని, కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నషా ముక్త్ భారత్ క్రింద కళాశాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అధ్యాపకులు, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని, జిల్లాను గతంలో కంటే మెరుగైన స్థానంలో ఉండే విధంగా అందరు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, కళాశాలల ప్రిన్సిపాళ్లురాందాస్, సతీష్, అతియాఖానం, తిరుపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

- గురుకులం అడ్మిన్ అసిస్టెంట్ సెక్రటరీ రాజబాబు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన గురుకులంలో చదువుతున్న విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, 10, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని గురుకులం అడ్మిన్ అసిస్టెంట్ సెక్రటరీ రాజబాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన గురుకులాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులంలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. మెనూ కచ్చితంగా పాటిస్తూ విద్యార్థులకు పౌష్టిక భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వసతి గృహంలోని విద్యార్థులను సొంత పిల్లల చూసుకోవాలని సూచించారు. చలి కాలం ప్రారంభమైన నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేరువేరుగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భద్రయ్య, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, జేపీపీ ఓంకార్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి హామీ మేరకు ఆటోల బంద్ వాయిదా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రవ్యాప్తంగా ఆటో, టాక్సీ, క్యాబ్‌ల బంద్‌కు పిలుపునివ్వగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి చర్చలు జరుపుదామని చెప్పడంతో తాత్కాలికంగా వాయిదా వేశామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ తెలిపారు. శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఆటోల అడ్డా వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఆటో కార్మికులు, డ్రైవర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి చెప్పడంతో బంద్‌ను వాయిదా వేశామన్నారు. ముఖ్యంగా ప్రతినెల 5 నుంచి 6 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్మికులు అధైర్యపడొద్దని ధైర్యం చెప్పారు. చర్చలు సానుకూలంగా లేకపోతే ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ టికెట్‌పై 10శాతం రాయితీ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఈ నెల 6 నుంచి 31వరకు వరకు ఏసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికుల కోసం ఆర్టీసీ టికెట్‌పై 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మల్ నుంచి సికింద్రాబాద్ జేబీఎస్‌కు ఇదివరకు రూ.540 ఉండగా ఇప్పుడు రూ.500కే ప్రయాణించవచ్చన్నారు. ఈ అవకాశం డిసెంబర్ 31 వరకు ఉంటుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా వెలమ సంఘం నాయకులు శనివారం ఎస్పీ కార్యాలయంతో పాటు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుత పదవిలో ఉండి వెలమ కులస్తుల అంతు చూస్తానని బెదిరించడం, అసభ్య పదజాలంతో దూషించి మనోభావాలను గాయపరిచారని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని వెలమ సంఘ భవనంలో సమావేశమైన వెలమ కులస్తులు అక్కడి నుండి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఎమ్మెల్యే శంకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెలమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రావు, తిరుమల్‌రావు, కోశాధికారి చంద్రశేఖర్‌రావు సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

గాయకుడికి సన్మానం

నవతెలంగాణ -ఖానాపూర్



ఇటీవల అయ్యప్ప పాట పాడిన దస్తూరాబాద్ మాజీ ఎంపీపీ, గాయకుడు కిషన్‌ను శనివారం అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో జరిగిన కార్యక్రమంలో కిషన్ అయ్యప్పపై పాడిన యూట్యూబ్ ఛానల్‌లో వినిపించారు. భవిష్యత్తులో మరిన్ని అయ్యప్ప స్వామి పాటలతో రాణించి భక్తుల ఆదరాభిమానాలు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, ఆలయ కమిటీ సభ్యులు సట్ల శంకర్, అశోక్, రవి పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్టమైన భద్రత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతపై గోదాం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్‌తో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సాధారణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాం వద్ద పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 24 గంటలు సీసీ కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, బీఆర్ఎస్ నేత జీవన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఎంజీని కలిసిన బెల్లంపల్లి ఏరియా జీఎం

నవతెలంగాణ-రెబ్బెన

నస్పూర్‌లోని సీసీ క్లబ్‌లో మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ కె.సురేంద్ర మోహన్‌ని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందించి స్వాగతం పలికారి. బెల్లంపల్లి ఏరియాలో త్వరలో ప్రారంభించనున్న ఎంవీకే ఉపరితల గని ఎల్ఓఐ అనుమతులు, పనుల ప్రగతిపై చర్చించారు.

కళాకారుల ప్రోత్సాహానికి ఆనంద్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని కళాకారులను ప్రోత్సహించడానికి జనవరి 1న కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే ఆనంద్ మేళా ఉపయోగపడుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఆనంద్ మేళ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేస్తున్న సిల్వర్ జూబ్లీ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఆనంద్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఆనంద్ మేళా నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ ఏడాదితో 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తూ అవార్డులు, పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే కళాకారులు ఈనెల 20లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఇందులో తెలంగాణ ఉద్యమ గాయకుడు ఇర్ఫాన్, మోక్షిత డాన్స్ అకాడమీ సేవ సమితి అధ్యక్షుడు, డాన్స్ మాస్టర్ సంతోష్ పాల్గొన్నారు.

10న వాహనాల వేలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడ్డ వాహనాలను కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన వేలం వేయనున్నట్టు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వీ.రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ సమక్షంలో ఉదయం 11 గంటలకు ఈ వేలం పాట నిర్వహించనున్నామని, ఆసక్తి గలవారు కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి పూర్తి వివరాలు పొందవచ్చని ఆయన సూచించారు.

విజయోత్సవాలకు ఊపు తెచ్చిన సాంస్కృతిక సారథులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ఉద్యమం సమయంలో తమకంటూ ప్రత్యేకత చాటుకుని ప్రజల్లో ఉద్యమ ఆకాంక్ష రేపిన తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో గ్రామాల్లో ప్రత్యేక ఊపు తెస్తున్నారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే నేతృత్వంలో డీపీఆర్ఓ సంపత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీ 6 గ్యారంటీల అమలు విజయవంతంపై గ్రామాల్లో నవంబర్ 19వ తేదీ నుండి ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 15 మండలాల్లోని 57 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. ఏది ఏమైనా ప్రస్తుతం ప్రజాపాలన విజయోత్సవాలకు సాంస్కృతిక సారథి కళాకారుడు మంచి ఊపు అందించారని చెప్పవచ్చు.

18 నుండి డీఎడ్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 18వ తేదీ నుండి డీఎడ్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18 నుండి 24 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, శనివారం నుండి హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వివాహ ఖర్చులకు నాజ్ ఫౌండేషన్ చేయూత

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని నిరుపేద కుటుంబమైన మణెమ్మ కుమార్తె శ్రీలేఖ వివాహానికి శనివారం నాజ్ ఫౌండేషన్ చేయూతనందించింది. దాతల దృష్టికి తీసుకువెళ్లడంతో డోనేషన్స్ ద్వారా వచ్చిన డ్రెస్సింగ్ టేబుల్ ఇవ్వడం జరిగిందని నాజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ సాదిక్, పెయింటింగ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సదానందం, కాంగ్రెస్ మైనారిటీ ప్రెసిడెంట్ లాడెన్, తెలిపారు. ఇప్పటి వరకు దాతల సహకారంతో అనేక సేవ కార్యక్రమాలు చేయడం జరిగిందనీ, రానున్న రోజుల్లో కూడా కష్టాలల్లో ఉన్న వారికి నాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ అందిస్తామని తెలిపారు.

విద్యుద్ఘాతంతో మహిళ మృతి

నవతెలంగాణ-తాండూర్



ఆరెస్తుండగా విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన తాండూరు మండలంలో చోటు చేసుకుంది. పులగం సుమలత అనే మహిళ ఇనుప తీగ పై బట్టలు ఆరేస్తుండగా దానికి విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే పడిపోయి మతి చెందింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆమెను గమనించలేదు. దీంతో చేతులు పూర్తిగా కాలిపోయాయి. సుమలత అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాదారం ఎస్ఐ సౌజన్య కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారు

- ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య
- కాసిపేట గనిపై గేట్ మీటింగ్



నవతెలంగాణ-కాసిపేట

గుర్తింపు సంఘంగా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుంటే కొన్ని కార్మిక సంఘాల తెలిసి తెలియక రాజకీయ పబ్బం గడపటం కోసం కార్మికులను తప్పు దోవ పట్టిస్తున్నారని, దీనిని కార్మికులు గమనించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గత ఐదారేళ్ల నుంచి స్ట్రక్చర్ సమావేశం జరగక కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం యూనియన్లను, కార్మికుల సమస్యలను పట్టించుకోక, రాజకీయ జోక్యంతో అనేక సమస్యలు తీరలేదన్నారు. ఏఐటీయూసీ గెలిచిన తర్వాత మొట్ట మొదటి సారిగా డైరెక్టర్ సమావేశాలలో అనేక సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. డిస్మిసైన జేఎంటీ ఉద్యోగులకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. మైనింగ్ స్టాఫ్ టెక్నీషియన్లు, సూపర్ వైజర్లకు అండర్ గ్రౌండ్ అని ఫిట్ అయితే సర్ఫేస్ సూటబుల్ జాబ్ ఇవ్వడం కోసం ఒప్పందం కుదిరిందన్నారు. సింగరేణిలో నడిచే క్యాంటీన్లలో ప్రయివేటు వారిని తీసేసి సింగరేణి పర్మినెంట్ కార్మికులతో నడిపించాలని, క్వాలిటీ పెంచారని తెలిపారు. డిస్మిస్ అయిన ఉద్యోగులందరికీ అవకాశం ఇవ్వాలని కోరామని, మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఇలా 12 అంశాలపై చర్చించామన్నారు. కాని తెలిసి తెలియని కొన్ని సంఘాలు రాజకీయం పబ్బం గడపడం కోసం కార్మికుల తప్పుదోవ పట్టిస్తున్నారని. కార్మికులు గమనించాలన్నారు. ఈ నెలలో జరిగే సీఅండ్‌డీతో నిర్వహించే సొంతింటి కల పేరుపై ఇన్కమ్ టాక్స్ చెల్లించే విధంగా ప్రయత్నం చేస్తామని, అది ప్రభుత్వం సహకారం కూడా ఎంతో అవసరం ఉందన్నారు. గతంలో ఇట్టి విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కూడా తీసుకుపోయిన విషయాన్ని తెలియజేసినట్లు వివరించారు. ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం గుర్తింపు సంఘంగా కృషి చేస్తామని, కార్మికులు కార్మికుల సమస్యపై యూనియన్ల బేదం వదిలేసి కలిసికట్టుగా వచ్చి మనం హక్కులు మన సాధించే వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి, బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్, సభాధ్యక్షులు ఎస్ నాగేశ్వరరావు, చిప్పరి శ్రీహరి, మీరుగు లక్ష్మీ నారాయణ గారు, నెగ్గం శంకర్, రంజిత్ కుమార్, అశోక్, రాజేందర్, పార్వతి సురేష్, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ, ఫిట్ కమిటీ సభ్యులు, షిఫ్ట్ ఇంఛార్జు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి ప్రారంభించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, చెన్నూర్ పట్టణంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేసినందకు కృతజ్ఞతలు తెలిపారు. నేను కూడా లయన్స్ క్లబ్ మెంబర్ షిప్ పొందిన వ్యక్తినేనని తెలిపిన ఆయన లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి మాట్లాడుతూ సమాజానికి ఈ విధంగా సేవ చేయడం గర్వంగా ఉంటుందని అన్నారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, రామగుండం లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

చిత్తాపూర్ బస్సు పున:ప్రారంభించాలని వినతి



నవతెలంగాణ-మందమర్రి

మంచిర్యాల నుంచి మందమర్రి మీదుగా చిత్తాపూర్ వెళ్ళే ఆర్టీసీ బస్సు పున్న ప్రారంభించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ దేవపాలకు శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం మందమర్రి మండల, పట్టణ అధ్యక్షుడు ఆసంపల్లి శివ కుమార్, చిలుముల రాజకుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుండి మందమర్రి మీదుగా చిత్తాపూర్ వెళ్లే బస్సు కొన్ని రోజులుగా నడిపించడం లేదని దీంతో మండల కేంద్రంలో ప్రభుత్వ ఆదర్శ మోడల్ పాఠశాల, ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థిని విద్యార్థులు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోవు మూడు నెలలు విద్యార్థులకు అత్యంత విలువైన సమయం పరీక్షల సమయం కాబట్టి తక్షణమే స్పందించి బస్సు పునరుద్ధరించాల కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆసంపల్లి అఖిల్, తైదల మారుతి, వేల్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం



యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని లక్షెట్టిపేట సివిల్ కోర్టు జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీరాఘవేంద్ర లిటిల్ హాండ్స్ ప్రయివేటు పాఠశాలలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. చిన్నపిల్లలు వాహనాలు నడిపితే చట్ట ప్రకారం నేరం అన్నారు. రాజ్యాంగం చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగంలో ఉన్న హక్కులు విధులు తప్పకుండా పాటించాలన్నారు. రాజ్యాంగంలో ముఖ్యంగా వ్యవస్థలు ముఖ్యమైనవి అన్నారు. ఒకటి జుడీసీఎల్ 2, లెజిస్లేటివ్, 3లా అండ్ ఆర్డర్, 4 మీడియా వ్యవస్థ అన్నారు. నాలుగు వ్యవస్థలు సక్రమంగా పనిచేసినప్పుడే ప్రజలు సుఖశాంతులతో ఉంటారన్నారు. ముఖ్యంగా మీడియా వ్యవస్థ నిజాలను నెగ్గ తేలుతూ నీతి నిజాయితీలతో పనిచేసినప్పుడే ఆ పత్రికలు మీడియాపై ప్రజలకు విశ్వాసం ఉంటుందన్నారు. రాజ్యాంగానికి లోబడి ప్రతి ఒక్కరు నడుచుకోవాలని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణగా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చున్నారు. అనంతరం ఆయన న్యాయవాదులను రాఘవేంద్ర లిటిల్ హాన్స్ ప్రయివేటు పాఠశాల అధ్యాపకులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ హాండ్స్ రాఘవేంద్ర ప్రయివేట్ పాఠశాల కరస్పాండెంట్, జన్నారం మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కరిమల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, లక్షట్‌పేట కోర్టు ఏసీపీలు పద్మజ సత్యం, బారసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్, న్యాయవాదులు గుర్రం రాజారాంరెడ్డి, రాజేశ్వరరావు, శివశంకర్, సంతోష్, రహిమతుల్లా పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన విద్యాకమిషన్ చైర్మన్



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం రాష్ట్ర విద్యాశాఖ చైర్మెన్ ఆకునూరి మురళీ, అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలు, తరగతి గదులు బోధన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను ప్రారంభించిన ఆయన విద్యార్థులతో కలిసి మట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తి కలిగివుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి యాదయ్య, ఎంఈఓ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

భీమారం మండల కేంద్రంలో ఐటీఐ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలిల

భీమారం మండలంలో విద్యార్థుల సౌకర్యార్థం ఐటీఐతో పాటు జూనియర్ కళశాల ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థి రాపల్లి రాజన్న యాదవ్ కోరారు. శనివారం భీమారం జిల్లా పరిషత్ పాఠశాలను అకస్మికంగా సందర్శించిన ఆయన పాఠశాల స్థితిగతులు పాఠశాలకున్న పాధాన్యత వివరించారు. ఇక్కడి పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఉమ్మడి జిల్లా పరిధి మారుమూల ప్రాంతాలకు చెందిన వారు ఇప్పుడు గౌరవ ప్రదమైన పదవుల్లో కొనసాగుతున్నారని వివరించారు. ఈ పాఠశాలలో ఎన్‌సీసీ విభాగం ఏర్పాటు చేయాల్సిన అవసరముందని తెలిపారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన చైర్మన్ పాఠశాల స్థితిగతులు, వసతుల కల్పన పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలను సంధర్శించిన విద్యా కమిషన్ చైర్మన్ మురళీతో పాటు అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా విద్యాధికారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

ఆటో కార్మికులకు జీవన భృతి కల్పించాలి

నవతెలంగాణ-తాండూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని ప్రభుత్వం వెంటనే వారికి జీవన భృతి కల్పించాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు హబీబ్ భాషా కోరారు. 60 ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుని చనిపోయిన ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా శనివారం తెలంగాణ రాష్ట్ర నాన్ పొలిటికల్ జేఏసీ ఇచ్చిన బందు పిలుపులో భాగంగా ఆటోల బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాండూర్ మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15000 జీవన భృతి ఇవ్వాలని రూ.1000 కోట్ల ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఆటో కార్మికుని ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చాంద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి కొత్త శంకర్, సహాయ కార్యదర్శి పల్లె వెంకటేష్, కోశాధికారులు ఒరగంటి శుభాకర్, రఫీ ఖాన్, సలహాదారులు విద్యాసాగర్, టౌన్ అధ్యక్షుడు వాసాల సాయి, రేచిని అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు జపతి సతీష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వ్యతిరేక ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-హాజీపూర్

మత్తు పదార్థాలను నిర్మూలన ప్రచార పోస్టర్లతో పాటు ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న జాతీయ మహాసభల ప్రచార పోస్టర్లను శనివారం హాజీపూర్ మండలం పడ్తనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణికుమార్‌తో కలిసి యూఎస్ఎఫ్ఎఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ, మత్తు, గంజాయి వంటి వాటి బారిన పడి బంగారు భవితను అంధకారం చేసుకుంటున్నారని ఈ క్రమంలో మత్తు పదార్థాలను నిరోధించాల్సిన ఆవశ్యకతలో భాగంగా విద్యార్థులకు యూఎస్ఎఫ్ఎ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఎ జిల్లా అధ్యక్షుడు చెవుటు మల్లేశ్, హాజీపూర్ మండల అధ్యక్షుడు డొల్కసాయితేజ, విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నస్పూర్ : యువత మత్తు పదార్థాలను వీడి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మంచిర్యాల సీఐ ప్రమోద్ కుమార్ అన్నారు. శనివారం యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆధ్వర్యంలో మత్తుపదార్థాలను నిర్మూలన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనాటి యువత, విద్యార్థి లోకంలో అనేక విధాలుగా మత్తు పదార్థాలు బారినపడి వారి యొక్క బంగారు భవిష్యత్తు నష్టపరుచుకుంటున్నారన్నారు. మత్తు పదార్థ నిరోధక ఆవశ్యకత ఎంతో ఉందని, దానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెవుటు మల్లేష్, డొల్క సాయి తేజ పాల్గొన్నారు.



సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించ తలపెట్టిన సీఎం కప్ ఆటల పోటీలు శనివారం మండలంలో ప్రారంభించినట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. కాగా గ్రామ పంచాయతీల పరిధిలో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు శనివారం ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బోనగిరి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో మండల స్థాయిలో ఆటలపోటీలు నిర్వహించనుండగా 7,8 తేదీల్లో గ్రామ పంచాయతీల పరిధిలో ఆటల పోటీలు కొనసాగనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో రాణించిన విద్యార్థులు, వారి ఆసక్తి మేరకు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వార మండల స్థాయి పోటీలకు వారి వివరాలు ఆన్‌లైన్ చేసుకోవల్సివుంటుందని తెలిపారు. మండల స్థాయిలో రాణించిన విద్యార్థులను ఈ నెల 16 నుండి 21 వరకు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పోటీలకు విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలో గల 6 జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఎంఈఓ బోనగిరి శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్లు (పీఈటీ) ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. 2వ సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డ్‌పై పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రదన్శనకు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ సఫ్దర్ అలీ, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

మండల పరిధిలో 186 పోలింగ్ స్టేషన్లు

- ఎంపీడీఓ సత్యనారాయణ

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో 186 పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి శనివారం గ్రామ పంచాయతీల వారిగా గుర్తించిన పోలింగ్‌స్టేషన్ల వివరాలు వెల్లడించారు. మండల పరిధిలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా 31,156 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వెల్లడించిన నమూనా పోలింగ్‌స్టేషన్ల విషయంలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వార తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని హనుమాన్ ఆలయంలో ముస్లిం మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం మైనార్టీ కమిటీ తరపున అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని కమిటీ నాయకులు తెలిపారు. కులమతాలతీతంగా బెదాభిప్రాయాలు లేకుండా ఉండటానికి ఇందులో భాగస్వామ్యం కావాలని ఉద్దేశంతో ప్రారంభించడం జరిగిందని అన్నారు. గత రెండేండ్లుగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని రాబోయే రోజుల్లో కూడా దీన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు క్షఅష్లన్ సభ్యులు సయ్యద్ షాహిద్ అలీ పాల్గొన్నారు.

కైలాష్ టెకిడి నర్మదేశ్వర మందిరం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

మండలంలోని నిగిని గ్రామ పంచాయతీ పరిధిలో గల కైలాష్ టెకిడి మహాదేవుని మందిరం 22వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని పూజలు చేశారు. జనకళ్యాణం కొరకు శ్రీశ్రీశ్రీ పరమ పూజ్య సంత్ లింబాజి మహరాజ్ చేతుల మీదుగా నిర్వహించిన పంచకుండి మహారుద్రాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్ర కలిగిన కైలాష్ టెకిడిలో గల నర్మదేశ్వరుడిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నాయకులతో కలిసి ప్రసాదం స్వీకరించి వంటలను పరిశీలించారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలను అయ్యప్ప స్వాములు ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి జన్మదిన వేడుకలను ఆలయ అర్చకుడు నాగేశ్వర్ శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, అష్టోత్తరాలు, అభిషేకాలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గురు స్వాములు, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరంలో 9, 10వ తరగతిలో తెలుగు కంపల్సరీ సబ్జెక్టుగా చదువడానికి, 2025-26 విద్యా సంవత్సరంలో కేవలం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గడువు పొడిగించారు. గడువు పొగిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం శుభ పరిణామమని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.